క్లుప్తంగా

సోమర్యాగడితండా పాఠశాల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: సోమర్యాగడితండాలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకటేశం శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వర్‌రావు తదితరులున్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

ఎల్లారెడ్డి: రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం అడివిలింగాల, హాజీపూర్, సోమ ర్యాగడితండా, వెల్లుట్లపేట గ్రామాలలో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. గ్రామ సభలో రేషన్ కార్డులు రాని వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

సోలార్ లైట్ల విరాళం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు సరోజిని ట్రస్టు బృందం సభ్యులు సోలార్ లైట్లను విరాళంగా అందించారు. పాఠశాలలో పని చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మదన్ మోహన్ పదవ తరగతి విద్యార్థుల సౌకర్యార్థం అందించినట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ట్రస్టు నిర్వాహకులు సరోజనమ్మ, శ్రీనివాస్ తదితరులున్నారు.

లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులను ఇళ్లను డీసీఎస్‌వో మల్లి కార్జున్ బాబు పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకొన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులా కాదా అని తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శి బాలు, కారోబార్ స్వామి ఉన్నారు.

ఎస్జీటీ క్యాలెండర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: ఎస్జీటీల నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్జీటీ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీలు హీరాలాల్, హన్మండ్లు, వినీత, రవి కుమార్, సంజయ్, శ్రీకాంత్, వాజీద్‌అలీ, రమేశ్ నాయక్, సాయిరాం, శ్రీనివాస్, విఠల్, అజ్మీరా, సత్యనారాయణ తదితరులున్నారు.

రక్తదానానికి మించిన దానం లేదు



భిక్కనూరు: ప్రపంచంలో రక్తదానానికి మించిన దానం మరొక్కటి లేదని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ అన్నారు. సౌత్‌క్యాంపస్‌లో శుక్రవారం ఎకో క్లబ్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన డాక్టర్ రోనాల్డ్ రోస్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. రక్తదానంతో ప్రాణాలను కాపాడు–వీలైతే ఎక్కువ మందికి అవగాహన కల్పించు అనే లక్ష్యంతో రక్తదాన శిబిర కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు నాన్‌టీచింగ్ స్టాఫ్ రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, రోనాల్డ్‌రోస్ సంస్థ కార్యదర్శి వినోద్, ఉపాధ్యక్షుడు రాంచందర్, కళాశాల అధ్యాపకులు లలిత, యాలాది, హరిత, నారాయణ, నర్సయ్య, వైశాలి, రమాదేవి, ఇంద్రకరన్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రజాసమస్యలపై చొరవ

మద్నూర్(జుక్కల్): ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 130 మందికి చెక్కలను అందించినట్లు తెలిపారు. నాయకులు అముల్ షిండే, రాములు, మహేశ్ తదితరులున్నారు.

మురికి నీరు పోయే దారేది..?

- నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు
- పనుల్లో ధ్వంసమైన డ్రెయినేజీ
- సర్వీస్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



చికెన్‌సెంటర్ ఎదుట నిలిచిన మురికినీరు



గోపాల్‌పేటలో సర్వీస్‌రోడ్డుపై పారుతున్న మురికినీరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి ఏర్పాటు పనులతో నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో రోడ్డు పెద్దదిగా మారడంతోపాటు గ్రామంలో డ్రైనేజీ సమస్య కూడ పెద్దదవుతోంది. నాలుగు నెలల క్రితం గోపాల్‌పేటలో జాతీయ రహదారి ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ప్రసుతమున్న రహదారికి ఇరువైపులా మొదట చెట్లను తొలగించారు. అనంతరం రోడ్డు విస్తరణలో భాగంగా రహదారికి ఒకవైపు ఇదివరకు ఉన్న మురికికాలువను ధ్వంసం చేశారు. దీంతో రహదారి పక్కనే ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్వీస్ రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో సర్వీస్ రోడ్డులో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారమయ్యేదెట్లా..?

గోపాల్‌పేటలో డ్రైనేజీ సమస్య తీవ్రమైంది. గతంలో ఉన్న డ్రైనేజీ ధ్వంసం కావడంతో ప్రస్తుతం మురికి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. రహదారికి ఒక పక్కనున్న ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరు ఇళ్ల వెనకకు పారే అవకాశం ఉంది. కాని రహదారికి మరో పక్కనున్న ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరు వెనకవైపునకు ప్రవహించే అవకాశం లేదు. దీంతో ఇళ్ల నుంచి వస్తున్న మురికినీరు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్వీస్‌రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీనివల్ల సర్వీస్‌రోడ్డు పనులకు సైతం ఆటంకం కలుగుతుంది. ప్రధాన రహదారికి, సర్వీస్ రోడ్డుకు మధ్య నిర్మించిన డ్రైనేజీలు కేవలం వర్షపునీరు పారేందుకు మాత్రమేనని రోడ్డు పనుల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇలాగైతే తమ ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరు ప్రవహించే దారేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాని గ్రామంలో కొంతమంది సర్వీస్‌రోడ్డును తవ్వి వర్షపునీరు పారేందుకు నిర్మించిన డ్రైనేజీలోకి పైపులైన్లు వేసుకున్నారు. కొందరికి మాత్రమే ఇలాంటి అవకాశం ఇవ్వడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఇళ్లు ఉన్న వారందరికీ సర్వీస్‌రోడ్డు కిందనుంచి పైపులైన్ వేసుకునేందుకు అనుమతివ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు కల్పించుకొని తమ గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని గోపాల్‌పేట గ్రామస్తులు కోరుతున్నారు.

మురికినీరు ఎటు పోవాలి



గోపాల్‌పేటలో సుమారు 50 ఏళ్ల నుంచి నా ఇల్లు రోడ్డు పక్కనే ఉంది. ఇదివరకు రోడ్డు పక్కనే ఉన్న మురికికాలువలోకి నా ఇంటి మురికినీరు పోయేది. ఇప్పుడు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నా ఇంటి ముందున్న మురికికాలువను ధ్వంసంచేసి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు నా ఇంటి నుంచి వచ్చే నీరు ఎటు పంపాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి.

– హబీబ్, గోపాల్‌పేట

వాసన భరించలేకున్నాం



మా గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు మొదలైనప్పటి నుంచి నా దుకాణం ఎదుట మురికినీరు నిలుస్తోంది. ఇదివరకు నా దుకాణం ముందు మురికి కాలువ ఉండేది. రోడ్డు పనుల్లో భాగంగా పాత మురికి కాలువను ధ్వంసం చేసి సర్వీస్ రోడ్డు పనులు చేపట్టారు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు సర్వీస్‌రోడ్డుపైనే పారుతోంది. దీనివల్ల మాకు తీవ్ర దుర్గంధం వస్తోంది. వాసన భరించలేకున్నాం.

– ఇర్షాద్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, గోపాల్‌పేట

రాజకీయ ఎదుగుదల ఓర్వలేకే ఆరోపణలు

రాజంపేట: తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకే కొందరు వ్యక్తులు తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు జూకంటి మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం తనపై వచ్చిన వార్తలను ఖండిస్తూ రాజంపేట మండల కేంద్రంలో మాట్లాడారు. తనపై ఫిర్యాదు చేసిన కృష్ణారెడ్డి, వీరన్నపటేల్, ముత్యం సిద్దరాములతో పాటు అక్బర్ అలీలు గ్రామానికి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అక్రమంగా డబ్బులు సంపాదించిన చరిత్ర వారిదని ఆరోపించారు. రాజంపేట పీహెచ్‌సీకి సంబంధించిన 12 గుంటల భూమి తమ కుటుంబీకులదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జూకంటి మోహన్‌రెడ్డి

గతంలో తమ వంశీయులే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సొసైటీలకు సైతం భూమిని దానం చేశారని గుర్తు చేశారు. ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని, తమ వద్ద అన్ని రకాల సర్వే రిపోర్టులు ఉన్నాయన్నారు.

కాంగ్రెస్ మాదిగలను మోసం చేస్తోంది

రామారెడ్డి: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చినా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణను అడ్డుకుంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొత్తోళ్ల యాదగిరి ఆరోపించారు. గిద్ద గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దుబ్బాక నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా కాస్త్రారి శైలేష్, కార్యదర్శులుగా ఏడారపు నరసయ్య, యూత్ కమిటీ అధ్యక్షుడిగా నవీన్‌లను ఎన్నుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సర్వసభ సమావేశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి డప్పులు తీసుకొని సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఏఎంసీ ఆదాయ పెంపునకు కృషి చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఏఎంసీ ఆదాయ పెంపునకు కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారెడ్డి రజితారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్కెట్ కమిటీకి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రావాల్సిన బకాయిలను తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజు, కార్యదర్శి శ్రీకాంత్, డైరెక్టర్లు ఉన్నారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా భూమేశ్?





కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మొగిలిపల్లి భూమేష్ ఏకగ్రీవంగా ఎన్నిక లాంఛనమైంది. అధ్యక్ష పదవికి శుక్రవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా సమయం ముగిసే వరకు భూమేశ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పరిశీలన అనంతరం భూమేష్ ఒక్కరే పోటీలో ఉండడంతో ఆయన ఎన్నికైనట్టుగా ప్రకటించినట్టు ఎన్నికల ప్రతినిధి కైలాస్ శ్రీనివాస్ రావు తెలిపారు. అధికారికంగా 26న ఉపసంహరణ గడువుందన్నారు. భూమేష్‌ను ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వలిపిశెట్టి లక్ష్మీరాజం, ఎం.శ్రీకాంత్, రాజేందర్, ఎస్.గౌరీశంకర్, ఆనంద్, జి.భాస్కర్, బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా దోమల శ్రీధర్

రామారెడ్డి: రామారెడ్డి పద్మశాలి సంఘం భవనంలో మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోమల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా కాముని కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సుప్పని రవి, కోశాధికారిగా భూపతి శ్రీనివాస్, ఆడిటర్‌గా కోమటి దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులుగా బుర్ల గంగాధర్, గోనె లింగంను ఎన్నుకున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

కామారెడ్డి అర్బన్: బాలికల శారీరక, మానసిక, లైంగిక, ఆరోగ్య పరిరక్షణపై సరైన అవగాహన కల్పించాలని జిల్లా పరీక్షల కమిషనర్ బలరామ్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్య బృందం, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అతిథిగా బలరామ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. వైద్యులతో పాటు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులకు క్రీడా పోటీలు పెట్టి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్ఎస్ కార్యవాహిక నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అకడమిక్ ప్రిన్సిపల్ నగేశ్, కపిల, సరోజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్యులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జిల్లా పరీక్షల కమిషనర్ బలరామ్

ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

బాన్సువాడ రూరల్ (బాన్సువాడ): జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సాయిచరణ్ తదితరులు ఉన్నారు.

సమాచారం..

నేడు గాంధారిలో ఎమ్మెల్యే పర్యటన

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు శనివారం(నేడు) పర్యటిస్తారని మాజీ సర్పంచ్ సంజీవు శుక్రవారం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గాంధారి వాగుపై రెండు చోట్ల పోచమ్మ రేవు, సంగెం రేవు వద్ద వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వంతెన నిర్మాణాలు చేపట్టే స్థలాలను పరిశీలిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి రోజూ పోచమ్మ రేవు, సంగెం రేవు దాటి పొలం పనులకు వెళ్లే రైతులు హాజరు కావాలని మాజీ సర్పంచ్ కోరారు.

ఎల్లారెడ్డికి రాక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి నేడు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు భూమిపూజ చేసేందుకు వస్తున్నట్లు వారు తెలిపారు.

బోరు మోటార్ ప్రారంభం

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 15, 18 వార్డులలో నూతనంగా బోరు మోటార్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. కాలనీలో నీటి సమస్యను తీర్చేందుకు మున్సిపల్ నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వనతి, మీర్జా హఫీజ్ బేగ్, శివకృష్ణమూర్తి, చాట్ల వంశీ, నజీరొద్దీన్ ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి రికవరీ చేసి ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన సుధాకర్ తన సెల్‌ఫోన్ పోవడంతో సీఈఐఆర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఫోన్ ఆచూకీని కనుక్కొని అందించినట్లు ఎస్సై తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలపై అవగాహన

భిక్కనూరు: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ప్రతి విద్యార్థి కృషిచేయాలని భిక్కనూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఘు అన్నారు. శుక్రవారం ఆయన సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకుల పాఠశాల ప్రవేశం కోసం అవగాహన కల్పించారు. ఆసక్తి కల విద్యార్థులు ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 23న పరీక్ష నిర్వహిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశం, హెచ్‌ఎం కల్పన, ఉపాధ్యాయురాలు స్వప్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

మద్నూర్(జుక్కల్): ప్రజాస్వామ్యానికి ఓటు పునాదిలాంటిదని, ఓటు హక్కు ఎంతో ముఖ్యమని ప్రిన్సిపాల్ గంగాకిషోర్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు– ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి గణతంత్ర్య దినోత్సవ వేడుకలలో బహుమతులు అందిస్తామని ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, సంతోష్, రాము, గోవింద్, శైలజ, సంజీవ్, గణేష్, వేణుగోపాల్, సమీనా, నాగేందర్ తదితరులున్నారు.

పరీక్షలు అంటే భయపడొద్దు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరీక్షలు అంటే భయపడవద్దని కష్టపడి, ఇష్టంగా చదువాలని ఎంఈవో రామ స్వామి అన్నారు. కాలోజీవాడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం దాతలు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలు, బెల్టులు, గుర్తింపు కార్డులు తదతర సామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికతో ముందుకు సాగాలని, సంకల్పం గట్టిదైతేనే విజయం సాధిస్తారన్నారు. మండల నోడల్ ఆఫీసర్ రమేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కల్యాణి, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, గ్రామపెద్దలు వెంకట్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

అర్హుల కోసమే ప్రభుత్వ పథకాలు



రూసేగావ్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మద్నూర్(జుక్కల్): అర్హులైన కోసమే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. రూసేగావ్‌లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు అమలవుతాయన్నారు. అర్హుల కోసం ప్రతి గ్రామంలో పరిశీలన జరిపి లబ్ధిదారుల జాబితాను అధికారులు రూపొందిస్తున్నారని తెలిపారు. పేర్లు లేని వారు గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ ముజీబ్, అధికారులు, గ్రామస్తులున్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి అర్బన్: రాజంపేట మండలం ఆర్గొండ అటవీప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందిపై కొందరు దాడి చేయడాన్ని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ(టీజీఈజేఏసీ), టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.దేవేందర్‌లు ఖండించారు. శుక్రవారం జేఏసీ పక్షాన జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కలెక్టర్‌ను కోరారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఎం.నాగరాజు, టీజీవో కార్యదర్శి సాయిరెడ్డి, ప్రతినిధులు అటవీశాఖ ఉద్యోగులున్నారు.

33వ సారి రక్తదానం



దోమకొండ: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లవ్వ(62)కు ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా ఎ–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో దోమకొండ మండల కేంద్రానికి చెందిన రవి మానవతా దృక్పథంతో స్పందించి 33వ సారి రక్తాన్ని అందించారని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎక్కడా లేని విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో 100 మంది రక్తదాతలు సంవత్సరానికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారని, అందులో రవి కూడా ఒకరిని అన్నారు. రక్తదాతను ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని, సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. శుక్రవారం బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది వైద్యులు ఉన్నారు.. వైద్యం ఎలా అందుతుంది.. ఓపీకి ఎంత మంది రోగులు వస్తున్నారు.. మందులు అందుబాటులో ఉన్నాయా అని తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఎక్స్‌రే ల్యాబ్ టెక్నీషియన్ లేక మూతపడి ఉండటం గమనించి.. డిప్యూటేషన్‌పై టెక్నీషియన్‌ను పిలిపించి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి రోగులతో మాట్లాడి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వికారాబాద్ మెడికల్ కళాశాల పీడియాట్రిక్ ప్రొఫెసర్ శిరీష, ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్, నాయకులు విఠల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ రేషన్ డీలర్ల మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. అధ్యక్షుడిగా కెతావత్ కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌లను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారన్నారు. వారికి నియామక పత్రం అందించి ప్రతిజ్ఞ చేయించారు. రేషన్ డీలర్ల సమస్యలపై పోరాడుతామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు అన్నారు. దత్తు, బస్వరాజ్, దశరథ్, బలరాం, ఆసిఫ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో సంక్షేమాధికారి బస



కామారెడ్డి అర్బన్: జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.దయానంద్, రీజినల్ కో–ఆర్డినేటర్ ఆర్.కిరణ్‌గౌడ్‌లు గురువారం రాత్రి కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వాసవీకాలనీలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం అక్కడే రాత్రి నిద్రపోయారు. శుక్రవారం ఉదయం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆఖరి రోజూ ఆగని నిలదీతలు



గోపాల్‌పేట గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తుడు



రామారెడ్డిలో ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: పథకాల జాబితాల్లో అనర్హుల పేర్లు ఎలా వచ్చాయని, అర్హుల పేర్లు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తూ జిల్లాలో పలు చోట్ల జరిగిన గ్రామసభల్లో శుక్రవారం అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పేర్లు జాబితాలో రాలేదంటూ చాలా చోట్ల నిలదీశారు. ప్రస్తుతమున్న జాబితాలను రద్దు చేసి మళ్లీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో శాంతించారు. పలు గ్రామసభలను పోలీసు పహారా మధ్య నిర్వహించారు.



రీసర్వే చేయాలని భిక్కనూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాచాపూర్ గ్రామస్తులు